క్లుప్తంగా

వేంకటేశ్వరస్వామి ఆలయంలో పూజలు



హోమం కార్యక్రమంలో పాల్గొన్న భక్తులు

చేవెళ్ల: మండలంలోని తంగడపల్లి గ్రామంలో ఉన్న దశావతార సమేత లక్ష్మీవేంకటేశ్వర స్వామి ఆలయంలో శనివారం ప్రత్యేక పూజలు, హోమాలు నిర్వహించారు. స్వామికి లక్షతులసీ అర్చన, 108 కొబ్బరికాయలతో శ్రావణమాసం ముగింపు పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకుడు అయ్యవారి వెంకటాచార్యులు మాట్లాడుతూ.. 85వ శ్రావణ నక్షత్రాన్ని పురస్కరించుకొని దశావతార సహిత లక్ష్మీవేంకటేశ్వరస్వామిని దర్శించుకుంటే ప్రజలకు గ్రహ దోషాలన్నీ పోతాయని తెలిపారు. ఈ సందర్భంగా ఆలయంలో స్వామివారికి నవకలశ స్నాపన తిరుమంజనం(అభిషేకం), హోమం, సహస్ర నామ అర్చన, అన్న ప్రసాద సంతర్పణ కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. ఈ పూజల్లో ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ పూజా కార్యక్రమాలు అర్చకులు శేషాద్రి, వేణుమాధవన్‌ల ఆధ్వర్యంలో కొనసాగాయి.

పోచారం శ్రీనివాస్‌రెడ్డికి శుభాకాంక్షలు



పోచారం శ్రీనివాస్‌రెడ్డికి శుభాకాంక్షలు తెలుపుతున్న ఎమ్మెల్యే కాలె యాదయ్య

చేవెళ్ల: రాష్ట్ర వ్యవసాయ సలహాదారుడిగా ప్రమాణస్వీకారం చేసిన పోచారం శ్రీనివాస్‌రెడ్డికి ఎమ్మెల్యే కాలె యాదయ్య పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. శనివారం హైదరాబాద్‌లో ప్రమాణస్వీకారం చేసిన అనంతరం ఆయనను ఎమ్మెల్యే స్థానిక నాయకులతో కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఆయన వెంట కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు వీరేందర్ రెడ్డి ఉన్నారు.

అలరించిన ముగ్గుల పోటీలు



ముగ్గుల పోటీల్లో పాల్గొన్న మహిళలు

కొత్తూరు: వినాయక చవితి ఉత్సవాల్లో భాగంగా శనివారం పట్టణంలోని ఆరో వార్డులో కౌన్సిలర్ వీరమోని హేమాదేవేందర్ ఆధ్వర్యంలో మహిళలకు నిర్వహించిన ముగ్గుల పోటీలు పలువురినీ అలరించాయి. ముగ్గుల పోటీల్లో మహిళలు ఉత్సాహంగా పాల్గొని ముగ్గులు వేయడంతో పాటు వాటిని రంగులతో చక్కగా అలంకరించారు. ముగ్గుల పోటీల్లో విజేతలను నిమజ్జనం రోజు ప్రకటించి వారికి బహుమతులు ప్రదానం చేయనున్నట్లు ఆమె తెలిపారు. కార్యక్రమంలో నాయకులు దేవేందర్ ముదిరాజ్, సురేశ్, నర్సింహ పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

కొత్తూరు: ఇటీవల రోడ్డు ప్రమాదంలో మరణించిన పట్టణానికి చెందిన బీజేపీ నాయకుడు కడెంపల్లి సదానంద్‌గౌడ్ అన్న కుమారుడు కడెంపల్లి శ్రీధర్‌గౌడ్ కుటుంబాన్ని శనివారం ఎంపీ డీకే అరుణ పరామర్శించారు. ఈ సందర్భంగా ఆమె మృతుడి కుటుంబ సభ్యులను ఓదార్చి అండగా ఉంటామని వారికి ధైర్యం కల్పించారు. కార్యక్రమంలో నాయకులు పాలమూరు విష్ణువర్ధన్‌రెడ్డి,నాగరాజుచారి, మహేందర్‌రెడ్డి, శ్రీనివాస్, మోహన్‌సింగ్, గోవర్ధన్‌గౌడ్, సుధాకర్, అరవింద్ పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

మొయినాబాద్‌రూరల్: తెలంగాణ సాంఘిక సంక్షేమ వికారాబాద్ డిగ్రీ కళాశాలలో పార్ట్ టైమ్ టీచర్ల భర్తీకి దరఖాస్తులు స్వీకరిస్తున్నామని ప్రిన్సిపాల్ డాక్టర్ కె.విజయ తెలిపారు. శనివారం ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మండల పరిధిలోని తోల్‌కట్ట సమీపంలో గల ఎస్‌వీ ఇంజినీరింగ్ కళాశాల లో కొనసాగుతున్న సాంఘిక సంక్షేమ మహిళా డిగ్రీ కళాశాలలో ఖాళీగా ఉన్న బీఎల్ కంప్యూటర్ సైన్స్, మ్యాథమేటిక్స్, కామర్స్, తెలుగు సబ్జెక్టులకు సంబంధించి పార్ట్ టైమ్ ప్రతిపాదికన పని చేసేందుకు అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని, ఆసక్తి గలవారు TGSWREIS COE కొత్తగడి వికారాబాద్‌లో ఈ నెల 16వ తేదీన నిర్వహించబోయే డెమో తరగతులకు సంబంధిత సర్టిఫికెట్లతో ఉదయం 9 గంటలకు హాజరుకావాలని ప్రిన్సిపాల్ విజయ కోరారు. ఈ సందర్భంగా 16వ తేదీన ఒరిజనల్ సర్టిఫికెట్లు, రెండు సెట్‌ల జిరాక్స్‌లు బయోడేటాతో హాజరుకావాలని తెలిపారు.



మొయినాబాద్‌రూరల్: బాకారంలో మంగళ హారతులతో గణనాథుడి పూజల్లో పాల్గొన్న మహిళలు



షాద్‌నగర్‌రూరల్: గణనాథుడి పూజలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే చౌలపల్లి ప్రతాప్‌రెడ్డి

జయములివ్వు బొజ్జగణేశా..

చేవెళ్ల, షాద్‌నగర్ నియోజకవర్గాల్లో గణేశ్ నవరాత్రులను భక్తిశ్రద్ధలతో జరుపుకుంటున్నారు. ఉత్సవాల్లో భాగంగా ఎనిమిదోరోజు శనివారం ఆయా మండపాల్లో గణనాథులకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారికి ఇష్టమైన నైవేద్యాలు సమర్పించి జయములివ్వు బొజ్జగణేశా అంటూ వేడుకున్నారు. పలు మండపాల వద్ద నిర్వాహకులు అన్నదాన కార్యక్రమాలు చేపట్టారు. ఆయా గ్రామాల్లోని పలు వినాయకులను నిమజ్జనానికి తరలిస్తున్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన లడ్డూ వేలం పాటలో భక్తులు ఉత్సాహంగా పాల్గొని స్వామివారి ప్రసాదాన్ని దక్కించుకున్నారు. అనంతరం గణనాథులను నృత్యాలు, ఆటపాటలతో నిమజ్జనానికి తీసుకెళ్లారు.



షాద్‌నగర్‌రూరల్: విజయనగర్‌కాలనీలో అన్నదాన కార్యక్రమం



చేవెళ్ల: ముడిమ్యాలలో వినాయకుడి లడ్డూ దక్కించుకున్న బీఆర్ఎస్ నాయకుడు వంగ శ్రీధర్‌రెడ్డి



చేవెళ్ల: న్యూ జర్నలిస్ట్ కాలనీలో పూజలో పాల్గొన్న కాలనీవాసులు



మొయినాబాద్‌లో రోడ్డుకు దూరంగా నిలిపిన కారు ఫొటో తీసి చలాన్ వేసిన పోలీసులు

ట్రాఫిక్ పోలీసుల అత్యుత్సాహం

- రోడ్డుకు దూరంగా వాహనాలు నిలిపినా చలాన్లు విధింపు
- ఇబ్బంది పడుతున్న వాహనదారులు

మొయినాబాద్: ట్రాఫిక్ పోలీసులు అత్యుత్సాహం ప్రదర్శిస్తున్నారు. ట్రాఫిక్ జామ్ అయితే పట్టించుకోని పోలీసులు ఫొటోలు తీసి చలాన్లు వేయడమే పనిగా పెట్టుకున్నారు. మండల కేంద్రంలో ఉదయం, సాయంత్రం సమయాల్లో భారీగా ట్రాఫిక్ జామ్ అవుతోంది. సోమవారం రోజు మొయినాబాద్‌లో అంగడి ఉండటంతో ట్రాఫిక్ సమస్య మరింత ఎక్కువగా ఉంటుంది. అయితే మొయినాబాద్‌లో విధులు నిర్వహించే రాజేంద్రనగర్ పోలీసులకు రోడ్డుపై ట్రాఫిక్ జామ్ అయినా కనిపించదు కానీ రోడ్డు పక్కన నిలిపిన వాహనాల ఫొటోలు తీయడమే డ్యూటీగా చేస్తున్నారు. రోడ్డుపై వాహనాలు నిలిపితే ఫొటోలు తీస్తే తప్పులేదు.. కానీ రోడ్డు కిందికి, దూరంగా నిలిపిన వాహనాల ఫొటోలు తీసి చలాన్లు వేస్తున్నారు. గత కొన్ని నెలలుగా చాలా మంది వాహనదారులకు ఇలాంటి చలాన్లు వచ్చాయి. చిలాంటి చలాన్లతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని స్థానికులు ఆరోపిస్తున్నారు. పోలీసు ఉన్నతాధికారులు స్పందించి మొయినాబాద్‌లో ట్రాఫిక్ సమస్యను పరిష్కరించాలని, అనవసరంగా రోడ్డుకు దూరంగా నిలిపిన వాహనాల ఫొటోలు తీయకుండా చూడాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

పెండింగ్ వేతనాలు చెల్లించాలి

- ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షుడు నర్సింహారెడ్డి



ఆస్పత్రి ఎదుట నిరసన చేపడుతున్న నాయకులు

షాద్‌నగర్‌రూరల్: ప్రభుత్వ ఆస్పత్రిలో పనిచేస్తున్న సిబ్బందికి పెండింగ్‌లో ఉన్న వేతనాలను వెంటనే చెల్లించాలని ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షుడు టంగుటూరి నర్సింహారెడ్డి డిమాండ్ చేశారు. మా సమస్యలను పరిష్కరించాలని కోరుతూ శనివారం ఏఐటీయూసీ ఆధ్వర్యంలో మెడికల్, ఔట్ సోర్సింగ్ కార్మికులు ఆస్పత్రి ఎదుట నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లాలోని అన్ని కమ్యూనిటీ ఆస్పత్రుల్లో పనిచేస్తున్న సిబ్బందికి ప్రతినెల రూ.11వేల వేతనం ఇస్తున్నారన్నారు. పట్టణంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో పనిచేసే సిబ్బందికి మాత్రం ప్రతి నెల రూ.10వేలు మాత్రమే ఇస్తూ వేయి రూపాయలు ఎందుకు తగ్గించి ఇస్తున్నారని ప్రశ్నించారు. రెండు నెలలుగా వేతనాలు ఇవ్వకపోవడంతో మెడికల్, ఔట్‌సోర్సింగ్ కార్మికులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. ప్రతినెల సకాలంలో వేతనాలు వచ్చే విధంగా ఆస్పత్రి సూపరింటెండెంట్ చొరవ తీసుకోవాలని కోరారు. ప్రభుత్వ ఆసుపత్రిలో పని చేస్తున్న మెడికల్, ఔట్‌సోర్సింగ్ కార్మికుల సమస్యలను పరిష్కరించని యెడల కార్మికుల పక్షాన సమ్మె చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు బాల్‌రాజ్, వేమారెడ్డి, మల్లేశ్, పద్మ, సుజాత, జయమ్మ తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశీర్వాదంతోనే కాంగ్రెస్ పాలన

- కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి



చల్లా నర్సింహారెడ్డిని సన్మానిస్తున్న జైపాల్‌రెడ్డి, తదితరులు

మొయినాబాద్‌రూరల్: ప్రజల ఆశీర్వాదంతోనే రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి ప్రభుత్వం ద్వారా సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలు కొనసాగిస్తోందని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి అన్నారు. శనివారం నర్సింహారెడ్డి జన్మదినాన్ని పురస్కరించుకొని మండలంలోని పార్టీ నాయకులు జిల్లా ఉపాధ్యక్షుడు అజీజ్‌నగర్ కొత్త జైపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో భారీగా తరలివెళ్లి నర్సింహారెడ్డిని ఘనంగా సన్మానించి కేక్ తినిపించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం ద్వారా చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలకు అందరూ సహకరిద్దామన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర ముదిరాజ్ కార్పొరేషన్ చైర్మన్ బొర్ర జ్ఞానేశ్వర్‌ముదిరాజ్, చేవెళ్ల ఇన్‌చార్జి పామెన భీమ్‌భరత్, ఫిషర్‌మెన్ జిల్లా చైర్మన్ నారాయణపురం మహేందర్‌ముదిరాజ్, మండల అధ్యక్షుడు మాణయ్య, నాయకులు మర్రి రవీందర్‌రెడ్డి, వివిధ గ్రామాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

గురుకులాల సమస్యలు పరిష్కరించండి

- ఎమ్మెల్యేకు ఎంజేపీజీ ఆర్‌సీఓ యాదయ్యగౌడ్ వినతి



ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేస్తున్న ఆర్‌సీఓ యాదయ్యగౌడ్, ప్రిన్సిపాల్ ప్రీతి

షాద్‌నగర్‌రూరల్: మహాత్మా జ్యోతిరావు పూలే గురుకుల(ఎంజేపీజీ) పాఠశాలల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ శనివారం ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌కు ఎంజేపీజీ ఆర్‌సీఓ యాదయ్యగౌడ్ వినతి పత్రం అందజేశారు. ప్రభుత్వరంగ సంస్థల చైర్మన్‌గా ఎన్నికైన ఎమ్మెల్యేను ఆర్‌సీఓ యాదయ్యగౌడ్, చటాన్‌పల్లి గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ ప్రీతి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ.. గురుకుల పాఠశాలల్లో వసతులు లేక విద్యార్థులు ఇబ్బందులకు గురవుతున్నారని, కొన్ని పాఠశాలలకు ప్రభుత్వ భవనాలు లేకపోవడంతో అద్దె భవనాలలోనే కొనసాగుతున్నాయని ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. అద్దె భవనాల్లో అరకొర వసతులతో విద్యార్థులు కష్టాలు పడుతున్నారన్నారు. విద్యార్థుల సమస్యలను దృష్టిలో పెట్టుకొని గురుకుల పాఠశాలల్లో వసతులను కల్పించేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. అందుకు స్పందించిన ఎమ్మెల్యే విద్యార్థులకు ఎలాంటి సమస్యలు ఉన్నా వెంటనే పరిష్కరిస్తామని, ఆందోళన చెందొద్దని హామీనిచ్చారు.

'త్రిపుల్‌ఆర్'కు బూర్గుల పేరును ప్రతిపాదిస్తా

ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్



షాద్‌నగర్‌రూరల్: బూర్గుల విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే, నాయకులు

షాద్‌నగర్‌రూరల్: రాష్ట్రంలో నిర్మించనున్న రీజినల్ రింగ్ రోడ్డు(త్రిపుల్‌ఆర్)కు హైదరాబాద్ రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి బూర్గుల రామకృష్ణారావు పేరును ప్రతిపాదిస్తానని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. శనివారం దివంగత రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి బూర్గుల రామకృష్ణారావు వర్ధంతి సందర్భంగా పట్టణంలోని ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో గల బూర్గుల విగ్రహానికి ఎమ్మెల్యే పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. హైదరాబాద్ తొలి ముఖ్యమంత్రిగా బూర్గుల రామకృష్ణారావు అనేక సేవలను అందించారని గుర్తుచేశారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఏర్పాటు సమయంలో బూర్గుల ఎంతో ధైర్యంగా తన పదవిని త్యాగం చేశారన్నారు. బూర్గుల రామకృష్ణారావు అందించిన సేవలు మరువలేనివని కొనియాడారు. త్రిపుల్‌ఆర్‌కు బూర్గుల పేరు పెట్టేవిధంగా చర్యలు తీసుకోవాలని కోరుతూ సీఎం రేవంత్‌రెడ్డిని కలిసి వినతి పత్రం అందజేస్తానన్నారు. నియోజకవర్గంలో ఎంతో చరిత్ర కలిగిన మొగిలిగిద్దను మండలముగా ఏర్పాటుచేసి బూర్గుల రామకృష్ణారావు పేరును పెట్టాలని మాజీ ఎంపీపీ వన్నాడ ప్రకాశ్‌గౌడ్ ఎమ్మెల్యేను కోరారు. అదేవిధంగా వన్నాడ ప్రకాశ్‌గౌడ్ ఆధ్వర్యంలో నాయకులు బూర్గుల విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ మాజీ సభ్యుడు వెంకట్రామిరెడ్డి, నాయకులు యాదయ్యయాదవ్, బాబర్‌ఖాన్, రఘు, శ్రీకాంత్‌రెడ్డి, తిరుపతిరెడ్డి, బాల్‌రాజ్‌గౌడ్, చెన్నయ్య, బస్వం, ఎండి.ఇబ్రహీం, అశోక్‌గౌడ్, కృష్ణారెడ్డి, శ్రీనునాయక్, టీజీ.శ్రీనివాస్, ముబారక్, ఖదీర్, శేఖర్, కృష్ణశర్మ, అజ్మత్‌బాబ తదితరులు పాల్గొన్నారు.

ఎల్‌ఓసీ అందజేత

షాద్‌నగర్: కేశంపేట మండల పరిధిలోని నిర్దవెళ్లి గ్రామానికి చెందిన కార్తీక్ అనారోగ్యానికి గురై హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. నిరుపేద కుటుంబం కావడంతో వైద్యానికి ఆర్థికసాయం అందించాలని కుటుంబ సభ్యులు ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌ను కోరారు. వెంటనే స్పందించిన ఎమ్మెల్యే సీఎం సహాయనిధి నుంచి రూ.2లక్షల ఎల్‌ఓసీని మంజూరు చేయించారు. పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఈ పత్రాన్ని శనివారం బాధితుడి కుటుంబ సభ్యులకు ఎమ్మెల్యే అందజేశారు. కార్యక్రమంలో నాయకులు గూడ వీరేశ్, జగదీశ్వర్, భాస్కర్‌గౌడ్, జంగయ్య, వెంకట్‌రెడ్డి, ఆమేర్, శ్రీశైలం, మల్లయ్య, ముత్యాలు, చంద్రయ్య, రామకృష్ణ పాల్గొన్నారు.

మండపాల్లో వినియోగించిన డీజేలు సీజ్

చేవెళ్ల: మండలంలో మూడు వినాయక మండపాల వద్ద నిబంధనలకు విరుద్ధంగా ఉపయోగించిన డీజేలను సీజ్ చేసి నిర్వాహకులపై కేసులు నమోదు చేసినట్లు ఎస్ఐ ప్రదీప్‌కుమార్ తెలిపారు. మండల కేంద్రంలోని మూడు కాలనీల్లో శుక్రవారం రాత్రి మండపాల వద్ద డీజేలు వినియోగించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా మూడు కాలనీల్లో మండపాల నిర్వాహకులు, డీజే నిర్వాహకులైన పామెన గ్రామానికి చెందిన రాజ్‌కుమార్‌కు చెందిన పాడ్ బ్యాండ్, ఏట్ల ఎర్రవల్లికి చెందిన మామిడిపల్లి రాజుకు చెందిన డీజేకు సంబంధించిన స్టూడియో మాస్టర్ మిక్సర్, చేవెళ్లకు చెందిన విష్ణు దగ్గర డీజేకి సంబంధించిన వస్తువులను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. మండపాల్లో, నిమజ్జన సమయంలో డీజేలు వినియోగించటం నిషేధమని చెప్పారు. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించే నిర్వాహకులపై, డీజేల నిర్వాహకులపై కేసులు తప్పవన్నారు. పోలీసుల సూచనలు అందరూ పాటించాలన్నారు. లేదంటే చట్ట రీత్యా చర్యలు ఉంటాయని హెచ్చరించారు.

హిందీ భాషకు ఎంతో ప్రాముఖ్యత

గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ మాలతీ



హిందీ దివస్‌లో పాల్గొన్న ఉపాధ్యాయులు

మొయినాబాద్‌రూరల్: దేశంలో హిందీ భాషకు ఎంతో ప్రాముఖ్యత ఉందని సాంఘిక సంక్షేమ చేవెళ్ల పాఠశాల, కళాశాల ప్రిన్సిపాల్ మాలతీ పేర్కొన్నారు. శనివారం మండల పరిధిలోని తోల్‌కట్ట సమీపంలో గల సాంఘిక సంక్షేమ చేవెళ్ల పాఠశాల, కళాశాలలో హిందీ దివస్‌ను పురస్కరించుకొని పాఠశాల ఆవరణలో ఉపాధ్యాయులతో కలిసి విద్యార్థులకు ఆటపాటలు, వివిధ క్రీడలు, వ్యాసరచన పోటీలు నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో గెలుపొందిన వారికి బహుమతులు పంపిణీ చేశారు. దేశ వ్యాప్తంగా హిందీ భాషకు ఎంతో ప్రాముఖ్యత ఉందని విద్యార్థులకు వారు వివరించారు. విద్యార్థులు చేసిన నృత్యాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ధర్మ సమాజ్‌ను పటిష్టం చేద్దాం

పార్టీ రాష్ట్ర కార్యదర్శి దుర్గాప్రసాద్



మాట్లాడుతున్న దుర్గాప్రసాద్

కొందుర్గు: గ్రామీణస్థాయి నుంచే పార్టీని పటిష్టం చేయాలని ధర్మ సమాజ్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి దుర్గాప్రసాద్ సూచించారు. శనివారం కొందుర్గులో కొందుర్గు, జిల్లేడ్ చౌదరిగూడ మండలాలకు సంబంధించి ఏర్పాటు చేసిన పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. గ్రామాల్లో కమిటీల ఏర్పాటు తదితర అంశాలపై చర్చించారు. కమిటీల ఏర్పాటులో అన్ని వర్గాల వారికి ప్రాధాన్యతనివ్వాలని సూచించారు. ముఖ్యంగా మహిళలు, యువకుల పాత్ర ఉండేలా చూడాలన్నారు. రాబోయే స్థానిక ఎన్నికల్లో ధర్మ సమాజ్ పార్టీ అభ్యర్థులు ఉండేలా చూడాలన్నారు. స్థానిక సంస్థల్లో అధికారం చేపడితే పార్టీ బలోపేతం అవుతుందన్నారు. సమావేశంలో పార్టీ రాష్ట్ర నాయకులు భిక్షపతి, జిల్లా కన్వీనర్ రాకేశ్, కో-కన్వీనర్ మల్లేశ్, కార్యవర్గ సభ్యుడు పెంటయ్య, మండల కన్వీనర్ దప్పు రవి, నాయకులు నరేశ్, శ్రీను పాల్గొన్నారు.

రైతాంగ పోరాటం స్ఫూర్తిదాయకం

సీపీఐ జిల్లా కార్యదర్శి పాలమాకుల జంగయ్య



మాట్లాడుతున్న జంగయ్య

చేవెళ్ల: రైతాంగ సాయుధ పోరాట స్ఫూర్తి నేటి వర్గ పోరాటాలకు నాంది అని సీపీఐ జిల్లా కార్యదర్శి పాలమాకుల జంగయ్య అన్నారు. మండల కేంద్రంలో శనివారం తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట 76వ వార్షికోత్సవ సభను సీపీఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు, నియోజకవర్గ ఇన్‌చార్జి కె.రామస్వామి అధ్యక్షతన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ.. నాడు జరిగిన తెలంగాణ సాయుధ పోరాటం భూమి, భుక్తి, వెట్టిచాకిరి విముక్తి కోసం, గడీల పాలన, నిజాం దేశ్‌ముఖ్‌ల నుంచి ప్రజలకు విముక్తి కలిగించిన పోరాటమని నేటికీ ప్రపంచ పోరాటాలకు ఇది స్ఫూర్తిదాయకమని కొనియాడారు. ఈ పోరాటానికి సంబంధం లేని పార్టీలు, నాయకులు ఇప్పుడు తెలంగాణ సాయుధ పోరాటాన్ని తప్పుదోవ పట్టిస్తున్నాయని మండిపడ్డారు. ఆనాటి పోరాట స్ఫూర్తితో సీపీఐ పార్టీ జిల్లాలో భవిష్యత్‌లో వర్గ పోరాటాలను మరింత ఉధృతం చేస్తుందని ఆయన అన్నారు. కార్యక్రమంలో ఏఐకేఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎం.ప్రభులింగం, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి వడ్ల సత్యనారాయణ, మండల కార్యదర్శి ఎం.సత్తిరెడ్డి, సహాయ కార్యదర్శి ఎండీ.మక్బుల్, శంకర్‌పల్లి మండల కార్యదర్శి ఎం.సుధీర్, నాయకులు తదితరులు ఉన్నారు.

ఉచిత వైద్య శిబిరం

షాబాద్: పేద ప్రజలు ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని సంకెపల్లిగూడ మాజీ సర్పంచ్ కుమ్మరి దర్శన్ పేర్కొన్నారు. శనివారం మండల పరిధిలోని సంకెపల్లిగూడ, శేరిగూడ గ్రామాల్లో చేవెళ్లకు చెందిన పట్నం మహేందర్‌రెడ్డి మెడికల్ కళాశాల వైద్యులు ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా 270 మంది రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. 40 మందికి వారంరోజుల తర్వాత ఆస్పత్రికి తీసుకెళ్లి మెరుగైన వైద్యం అందజేస్తామన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పేదలకు కార్పొరేట్ స్థాయిలో వైద్యం అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో నిర్వహించే వైద్య శిబిరాలను పేద ప్రజలు వినియోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది, గ్రామస్తులు తదితరులు ఉన్నారు.



సంకెపల్లిగూడలో వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్లు